క్లుప్తంగా

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


మర్రిపూడిలో పూడిక తీస్తున్న పంచాయతీ కార్మికులు

రంగంపేట: ప్రస్తుతం మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రతిఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ వేము మాధవి సూచించారు. మండలంలోని మర్రిపూడి గ్రామంలో ఆదివారం పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. పారిశుధ్య కార్మికులతో డ్రైనేజీలు, కచ్చా డ్రైన్లలో పూడిక తీయించి బ్లీచింగ్ చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాధవి మాట్లాడుతూ రోడ్లపై చెత్త వేయకుండా ఇంటి దగ్గరకు వచ్చిన వాహనంలో వేయాలని, ఇంటి పరిసరాల పరిశుభ్రతతో మన ఆరోగ్యాన్ని మనమే కాపాడుకోవచ్చని ప్రజలకు సూచించారు.


శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

పెదపూడి: మండలంలో సోమవారం నుంచి ప్రారంభం కానున్న శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు జయప్రదం చేయాలని మండల విద్యాశాఖాధికారి–2 సీవీవీ సత్యనారాయణ తెలిపారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ ఈ నెల 22 నుంచి 28వ తేదీ వరకూ శిక్షా సప్తాహ్ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 22న ఉపాధ్యాయులు స్థానిక వనరులతో బోధన అభ్యసన సామగ్రి తయారు చేసి ప్రదర్శించాలన్నారు. 23న పునాది అభ్యసన, సంఖ్యాశాస్త్రం నైపుణ్యాల అభివృద్ధి కార్యక్రమాలుచ 24న క్రీడా పోటీలు, 25న సాంస్కృతిక దినోత్సవం, 26న సాంకేతిక నైపుణ్యాల దినోత్సవం, 27న పర్యావరణ పరిరక్షణ సంకల్ప యాత్ర, 28న సామాజిక భాగస్వామ్య దినోత్సవం నిర్వహించాలన్నారు.

నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురం వెలమ రామాలయం కల్యాణ మండపం వద్ద బ్రహ్మనాయుడు వెలమ సేవ సంక్షేమ సంఘం అనపర్తి, మండపేట నియోజకవర్గాల నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం జరిగింది. సంఘం అధ్యక్షుడిగా కర్రి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా నాడు వెంకటరమణ, గేదెల వీరబాబు, కార్యదర్శిగా కొల్లి శ్రీనివాస్, సహాయ కార్యదర్శులుగా చప్పా శ్రీనివాస్, భోజంకి శివరామకృష్ణ, కోశాధికారిగా సబ్బారపు సూర్యనారాయణ తదితరులతో గౌరవ అధ్యక్షుడు తెంటు సత్యనారాయణ ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, వేగుళ్ల జోగేశ్వరరావు హాజరయ్యారు. వారిద్దరినీ సంఘం సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలోని 93 కుల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు మాకిరెడ్డి భాస్కర గణేష్‌బాబు, వెలమ సంఘ నాయకులు పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలతో శాంతి సాధ్యం


ప్రార్థనలు నిర్వహిస్తున్న పాస్టర్ మాణిక్యం

మధురపూడి: ప్రపంచంలో క్రీస్తు బోధనలతోనే శాంతి సాధ్యమవుతుందని ఆర్‌సీఎం చర్చి పాస్టర్ రెవరెండ్ మాణిక్యం అన్నారు. కోరుకొండ ఎస్ఆర్ నగర్‌లోని చర్చిలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన సందేశమిస్తూ ప్రపంచంలో శాంతికి భంగం వాటిల్లి, దేశాలు, ప్రాంతాల మధ్య యుద్ధాలు జరుగుతున్నాయన్నారు. యుద్ధాలు సమసి, శాంతి ఏర్పడాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

చిన దొడ్డిగుంటలో డయేరియా లక్షణాలు

రంగంపేట: మండల పరిధిలోని చిన దొడ్డిగుంట గ్రామంలో ఇద్దరికి డయేరియా లక్షణాలు కనిపించడంతో రంగంపేట పీహెచ్‌సీ వైద్యాధికారి బి.వేణుశ్రీలక్ష్మి ఆధ్వర్యంలో సిబ్బంది గ్రామంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. అయితే వారిద్దరికీ డయేరియా లేదని, కలుషిత ఆహారం తీసుకోవడం వల్లే విరేచనాలు అయ్యాయని డాక్టర్ వేణుశ్రీలక్ష్మి తెలిపారు. ప్రస్తుతం అక్కడ ఎటువంటి డయేరియా కేసులు లేవన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.50 వేల విరాళం

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు గ్రామంలోని మంచి నీటిచెరువు వద్ద నూతనంగా నిర్మిస్తున్న ఆంజనేయస్వామి ఆలయానికి గ్రామానికి చెందిన కొవ్వూరి వెంకటకృష్ణారెడ్డి, స్వాతిమణి దంపతులు రూ.50 వేలు విరాళం ఇచ్చారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి చేతుల మీదుగా ఆలయాన్ని నిర్మిస్తున్న రజక సంఘం సభ్యులకు ఆదివారం అందజేశారు. అనంతరం రజక సంఘం సభ్యులు దాత వెంకటకృష్ణారెడ్డిని సత్కరించారు.

గోదావరీ

- మరింత ఉధృతమవుతున్న వరద
- బొబ్బిల్లంక, ములకల్లంక మధ్య పరవళ్లు
- అప్రమత్తమైన అధికార యంత్రాంగం


బొబ్బిల్లంక-ములకల్లంక మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

సీతానగరం: అఖండ గోదావరి వరద మరింత ఉద్రిక్త రూపం దాల్చుతోంది. ఆదివారం బొబ్బిల్లంక, ములకల్లంక మధ్య గోదావరి వరద పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తోంది. నియోజకవర్గ ప్రత్యేకాధికారి సాయిబాబా, మండల ప్రత్యేకాధికారి రామ్‌ప్రసాద్, ఈఓపీఆర్డీ మూర్తి, ఆర్ఐ లక్ష్మి, పీహెచ్‌సీ డాక్టర్ ఏవీకే చైతన్య కలిసి బొబ్బిల్లంక రేవు వద్దకు చేరుకుని, గోదావరి వరదను పరిశీలించారు. వరద మరింత ఉధృతమైతే బొబ్బిల్లంకలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ములకల్లంకలో పారిశుధ్యంపై అధికారులు ఆరా తీశారు. అదే విధంగా తాగునీటి సమస్య ఏమైనా ఉందా అని అడిగి తెలుసుకున్నారు. వీధుల్లో బ్లీచింగ్ చల్లాలని, అలాగే పంచాయతీ అందించే నీటిని క్లోరినేషన్ తప్పనిసరిగా చేయాలని పంచాయతీ అధికారులకు సూచించారు. ములకల్లంక, బొబ్బిల్లంకల్లో 24 గంటలు వైద్యశిబిరం నిర్వహించాలని ఆదేశించారు. వైద్య శిబిరాల్లో కుక్క, పాము కాటు వ్యాక్సిన్లు, ఇతర మందులు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ ములకల్లంక వాసులను అక్కడ నుంచి తరలించడానికి ప్రయత్నించినా, వారు అంగీకరించడం లేదన్నారు. గోదావరి వరద మరింత ఉధృతమైతే వారిని అక్కడ నుంచి తరలిస్తామని తెలిపారు. అలాగే పునరావాస కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. ఎప్పటికప్పుడు వరద సమాచారం తెలుసుకుని, ఆ మేరకు చర్యలు తీసుకుంటున్నామని వారు చెప్పారు.


పెదపూడిలో బాడవ ఊటకాలువ వద్ద ముంపునకు గురైన వరి పొలాలు


బొబ్బిల్లంక రేవు వద్ద వరద పరిస్థితిని పరిశీలిస్తున్న అధికారులు


బొబ్బిల్లంక రేవులో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న నియోజకవర్గ ప్రత్యేకాధికారి సాయిబాబా

ముంపులోనే వరి పొలాలు

పెదపూడి: అల్పపీడనం కారణంగా ఇటీవల ఏకధాటిగా వర్షం కురవడం, ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు వస్తుండడంతో మండలంలోని అనేక గ్రామాల్లో వరి పొలాలు ఇంకా నీటి ముంపులోనే ఉండిపోయాయి. మండలంలో సంపర, కాండ్రేగుల, చింతపల్లి, దోమాడ, కరకుదురు, ఏపీ త్రయం, గండ్రేడు, పెదపూడి తదితర గ్రామాల్లో సుమారు 650 ఎకరాల్లో వరి నాట్లు నీటి ముంపునకు గురయ్యాయి. మండల వ్యవసాయశాఖాధికారి టీవీఆర్ మణిదీప్ మాట్లాడుతూ గండ్రేడు, పుట్టకొండ తదితర గ్రామాల్లో కాల్వలో చెత్త, తూటికాడ తొలగింపు పనులు చేపట్టారని, ఒకటి రెండు రోజుల్లో నీరు దిగిపోతుందన్నారు. పొలాలకు ఎలాంటి నష్టం ఉండదని, రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదని చెప్పారు.

బోటు ఏర్పాటు చేసిన అధికారులు


బొబ్బిల్లంక రేవులో ఏర్పాటు చేసిన బోటు

సాక్షి ఇంపాక్ట్

సీతానగరం: కొద్ది రోజులుగా గోదావరి వరద ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఆదివారం బొబ్బిల్లంక-ములకల్లంక వాసుల సౌకర్యార్థం అధికారులు బోటును ఏర్పాటు చేశారు. 'జల దిగ్బంధంలోనే ములకల్లంక' కథనం ఆదివారం 'సాక్షి'లో ప్రచురితమైంది. ప్రజలు మర పడవలపై రాకపోకలు సాగిస్తున్నారని, వరద చాలా ఎక్కువగా ఉన్న కారణంగా ఈ ప్రయాణం సురక్షితం కాదని, లాంచీ లేదా బోటును ఏర్పాటు చేయాలంటూ ప్రజల విజ్ఞప్తిని కథనంలో ప్రస్తావించడంతో, అధికారులు స్పందించారు. రాజమహేంద్రవరం నుంచి బోటును తీసుకువచ్చి, అందులో లైఫ్ జాకెట్లను ఉంచారు. బొబ్బిల్లంక, ములకల్లంక వాసులు ఈ బోటుపై సురక్షిత ప్రయాణం చేస్తున్నారు.

31న బ్రాహ్మణ సమాఖ్య ప్రమాణ స్వీకారం

పెదపూడి: విశాఖపట్టణంలో ఈ నెల 31న ఆంధ్రప్రదేశ్ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య తూర్పుగోదావరి జిల్లా విభాగం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం నిర్వహించనున్నట్లు జిల్లా సమాఖ్య నూతన ప్రచార కార్యదర్శి కొత్తూరు సత్యనారాయణమూర్తి తెలిపారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి అందరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు.

ముంపుతో పంటకు ముప్పే

- వరి సాగుపై అన్నదాతల ఆందోళన
- నష్ట నివారణకు సూచనలు ఇస్తున్న ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు


ముంపునకు గురైన వరి పొలాలను పరిశీలిస్తున్న ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు

రాజానగరం: అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు వరి పంట కొన్నిచోట్ల ముంపు బారిన పడింది. బోర్ల సాయంతో వరి నాట్లు వేసిన ప్రాంతాలలో ముంపు వలన పెద్దగా సమస్యలేకున్నా, వారం రోజుల వ్యవధిలో నాట్లు వేసిన పొలాల్లో నాటిన నాట్లు ముంపునకు గురై, ఎందుకూ పనికి రాకుండా పోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. నియోజకవర్గంలో 16,550 హెక్టార్లలో ఖరీఫ్ వరి సాగు జరగాల్సి ఉండగా, బోర్లు ఉన్న చోట సుమారు 6,120 హెక్టార్లలోవరి నాట్లు వేశారు. నైరుతి రుతుపవనాల రాకతో కురిసిన వర్షాలతో దుక్కులు చేసుకుని, నార్లు వేసి, నాట్లు నాటే క్రమంలో చాలామంది రైతులు ఉన్నారు. ఇప్పటికే కొన్నిచోట్ల నాట్లు ముమ్మరంగా పడుతున్నాయి. ఈ తరుణంలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు తాజాగా వేసిన నాట్లతో పాటు, వారం, పది రోజుల క్రితం వేసిన నాట్లు కూడా దెబ్బతినే అవకాశం ఉందని రైతులు అంటున్నారు. వర్షం నీరు మూడు రోజుల పైబడి నిలిచి ఉంటే నాట్లు పూర్తిగా పాడైపోతాయని, వాటి స్థానంలో మరలా నాట్లు వేసుకోవలసి వస్తుందని, ఖర్చు చాలా పెరుగుతుందని చెబుతున్నారు.

228.62 మిల్లీమీటర్ల వర్షపాతం

నియోజకవర్గంలో ఈ నెలలో ఇంతవరకు 228.62 మి.మీ., వర్షపాతం నమోదైంది. సాధారణ వర్షపాతం కంటే మూడు రెట్లు ఎక్కువ. అంతేకాక మూడు రోజులలో 108.6 మి.మీ., వర్షం కురిసినట్లుగా రికార్డులు చెపుతున్నాయి. ఈ నెలలో కురిసిన వర్షానికంటే, సగం వరకు ఈ మూడు రోజులలోనే కురియడంతోనే వరి పంట ముంపునకు గురి కావడానికి ప్రధాన కారణంగా రైతులు చెబుతున్నారు.

ముంపునకు గురైతే..

ముంపు బారిన వరి పంటకు 5 రోజుల వరకు ఎటువంటి నష్టం ఉండదని దివాన్‌చెరువులోని ఏరువాక కేంద్రం కో–ఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకటనరసింహారావు అన్నారు. దాటితేనే సరైన యాజమాన్య చర్యలు తీసుకోవాలని సూచించారు. పొలాలో నిలిచిపోయిన వర్షం నీటిని దిగువకు ప్రవహించే విధంగా బోదుల ఏర్పాటు చేయాలన్నారు. ప్రస్తుతం జూన్‌లో విత్తిన పొలాలలో వరి పిలకల దశలో ఉందని, జూలైలో విత్తనాలు నేరుగా విత్తిన పొలాలలో మొలక దశలో ఉందన్నారు. పిలకల దశలో ఉంటే నీరు 5 రోజులు నిల్వ ఉన్నా ముంపును తట్టుకుంటుందన్నారు. నిల్వ ఉన్న నీటిని దిగువకు పోయే విధంగా ఏర్పాట్లు చేసుకుని, ఎకరానికి 20 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ వేసుకోవాలని సూచించారు.


మిరుమిట్లు గొలిపే బాణాసంచా కాల్పులు

అంబరాన్ని తాకేలా..

వైభవంగా గురజాల అక్కమ్మ తల్లి జాతర

రాజమహేంద్రవరం రూరల్: శాటిలైట్‌సిటీ గ్రామంలో ఉన్న గ్రామ దేవత గురజాల అక్కమ్మతల్లి 33వ జాతర మహోత్సవాలు ఆదివారం సాయంత్రం నుంచి ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జరిగాయి. ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. చీరలు, నైవేద్యం సమర్పించారు. రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చియ్యచౌదరి, ఇతర నేతలు అమ్మవారిని దర్శించుకోగా, కమిటీ సభ్యులు ఆయనను సత్కరించారు. ఆదివారం సాయంత్రం అమ్మవారి చల్లఘటం ఊరేగింపు రాజీవ్ గృహకల్ప సముదాయం నుంచి భారీ బాణసంచా, గరగ నృత్యాలు, డప్పు వాయిద్యాలు, బళ్లపై వేషధారణలు, ఆటపాటలతో అంగరంగ వైభవంగా బయలుదేరింది. రాత్రి 8 గంటల సమయంలో బస్టాండ్ సెంటర్‌లో అక్కమ్మ తల్లి ఆలయం వద్దకు చేరుకోగా, అమ్మవారి వద్ద చల్లఘటాన్ని పెట్టారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా భక్తులు వేలాదిగా తరలివచ్చి జాతరను తిలకించారు. తూర్పు మండల డీఎస్పీ కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో బొమ్మూరు పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎండీ ఉమర్ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా కమిటీ సభ్యులు చర్యలు చేపట్టారు.


బళ్లపై దేవతా వేషధారణలు


జాతర మహోత్సవంలో చల్ల ఘటాన్ని ఊరేగిస్తున్న భక్తులు

యువతి అదృశ్యం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఇంటి నుంచి వెళ్లిన తన కుమార్తె కనిపించడం లేదని రాజమహేంద్రవరం మల్లయ్యపేటకు చెందిన దేవు గౌరీనాథ్ ఆదివారం రాత్రి బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం, ఆదివారం సాయంత్రం 19 ఏళ్ల దేవు పల్లవి నాగప్రపూర్ణ ఇంటి నుంచి బయటకు వెళ్లింది. రాత్రి అయినప్పటికీగామె తిరిగి రాలేదు. ఈ మేరకు గౌరీనాథ్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.


శాకంబరి దేవిగా రాజరాజేశ్వరి అమ్మవారు


గాదాలలో శాకంబరిదేవి అలంకరణలో రాజరాజేశ్వరి అమ్మవారు

మధురపూడి: కోరుకొండ మండలం గాదాలలోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆదివారం భారీ అన్న సమారాధన జరిగింది. గురు పౌర్ణమి సందర్భంగా 15 రకాల కూరగాయలతో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి అభిషేకాలు, కుంకుమ పూజ, విశేష పూజలందుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు మొక్కులను తీర్చుకున్నారు.

ఘనంగా గురుపౌర్ణమి పూజలు

సాయిబాబా ఆలయాలకు పోటెత్తిన భక్తులు


బలభద్రపురంలో బాబాను దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి


పెదపూడి బోడవారివీధిలో ప్రత్యేక అలంకరణలో సాయిబాబా

పెదపూడి: మండలంలోని జి.మామిదాడ గ్రామం బోడావారి వీధిలో వెలసిన అభయ గణపతి ఆలయంలో వేంచేసియున్న శిరిడీ సాయిబాబాకు గురుపౌర్ణమి సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఇంద్రగంటి మూర్తి ఆధ్వర్యంలో తెల్లవారుజామున కాకాడ హారతితో సహస్రార్చన హారతి నిర్వహించారు. అనంతరం గ్రామ పుర వీధుల్లో బాబావారి రథోత్సవం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి బాబాను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ కన్వీనర్ ద్వారంపూడి యువరాజారెడ్డి, ఆలయ ప్రతినిధి ద్వారంపూడి వెంకటరెడ్డి, మేడపాటి సాయిబాబారెడ్డి తదితరులు పాల్గొన్నారు. పెదపూడిలోని ప్రాచీన సోమేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం శ్యామలాంబ సమేత సోమేశ్వరస్వామి వారికి ఘనంగా లక్షపత్రి పూజ చేశారు. గురుపౌర్ణమి సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు కొమ్మానపల్లి వెంకట్రావు ఆధ్వర్యంలో పది మంది రుత్వికులు ప్రత్యేక పూజలు చేశారు.

భక్తులతో పోటెత్తిన ఆంధ్రా శిరిడీ

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురం గ్రామంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. గ్రామంలో కొలువై ఉన్న ఆంధ్రా శిరిడీ సాయిబాబా ఆలయానికి భక్తులు పోటెత్తారు. బాబాకు గణపతి హోమం, ఏకరుద్రాభిషేకం, లక్షబిల్వార్చన, క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారికి బంగారు కిరీటాన్ని అలంకరించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు వచ్చి బాబాను దర్శించుకున్నారు. అనంతరం బాబాను పురవీధుల్లో ఊరేగించారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి బాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక కమిటీ అధ్యక్షుడు సబ్బెళ్ల పురుషోత్తమరెడ్డి తదితరులు పాల్గొన్నారు. మండలంలోని బిక్కవోలు గోలింగేశ్వరస్వామి ఆలయం వద్ద కొలువైన పార్వతీదేవి అమ్మవారిని ఆదివారం ఆషాఢ మాసం గురుపౌర్ణమి సందర్భంగా శాకంబరిగా అలంకరించారు. అర్చకులు కె.సత్యనారాయణ, ఎస్‌కేవీవీ సుబ్రహ్మణ్యంశర్మ అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే పందలపాక కట్లమ్మ తల్లిని శాకంబరిగా అలంకరించారు.

రాజానగరం: నియోజకవర్గంలో గురు పూర్ణిమ వేడుకలు ఆదివారం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా సాయిబాబా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. జోరున వర్షం కురుస్తున్నప్పటికీ, లెక్కచేయకుండా భక్తులు గురు పౌర్ణమి వేడుకలలో పాల్గొన్నారు. అన్నదాన సాయిగా పేరొందిన స్థానిక శిరిడీ సాయిబాబా ఆలయంలోను గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. వేకువజామున ఇచ్చే కాకడ హారతి అనంతరం బాబా మూలవిరాట్‌కు భక్తులు క్షీరాభిషేకాలు చేశారు. స్థానిక సాయిభక్త మండలి ఆధ్వర్యంలో గురుచరిత్ర పారాయణ చేశారు. బాబా సన్నిధిలో చిన్నారులకు పట్టిక బెల్లం తులాభారం వేసి, అన్న ప్రాసనలు కూడా చేశారు. అన్న సమారాధనలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మండలంలో దివాన్‌చెరువు, శ్రీరామపురం, ముక్కినాడ, కానవరం, తోకాడ, పల్లకడియం, పాలచర్ల, లాలాచెరువు, తదితర గ్రామాల్లో గురు పౌర్ణమి వేడుకలు జరిగాయి. ముక్కినాడలో శిరిడీ సాయిమూర్తికి తెల్లవారుజామున 108 కలశాల జలాలతో, పాలతోను అభిషేకాలు నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం జరిగింది.


రాజానగరంలోని శిరిడీ సాయిబాబా ఆలయంలో భక్తుల రద్దీ


బూరుగుపూడి బాబా ఆలయంలో మామిడిపల్లి రామారావును సత్కరిస్తున్న భక్తులు

గురువులకు సత్కారం

మధురపూడి: గురు పౌర్ణమి సందర్భంగా కోరుకొండ మండలంలో ఆదివారం గురువులకు ఘనంగా సత్కరించారు. బూరుగుపూడి బాబా ఆలయంలో బాబాకు వెన్నపూసి, 108 లీటర్లతో క్షీరాభిషేకం చేశారు. ఆలయ గురువు మామిడిపల్లి రామారావును మూతిన వసంతకుమార్ దంపతులు, ఆలయ కమిటీ, శిష్య బృందం పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. అనంతరం భారీ అన్న సమారాధన జరిగింది. మధురపూడిలోని సుందరస్వామిజీ ఆశ్రమంలో స్వామిని ఘనంగా సత్కరించారు. కోరుకొండ పెట్రోలు బంకు, శివాలయం రోడ్డులోని బాబా ఆలయాల్లో అభిషేకాలు, హారతుల కార్యక్రమాలు జరిగాయి.

దుప్పట్లు, భోజనం పంపిణీ

సీతానగరం: గురుపౌర్ణమి సందర్భంగా చీపురుపల్లిలో మాజీ సర్పంచ్ గోపిశెట్టి చెల్లారాణి చేతుల మీదుగా నిరుపేద వృద్ధులకు దుప్పట్లు, భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. స్థానిక రామాలయం వద్ద సెనక్కాయాల హరితాంబ జ్ఞాపకారం నాగపూర్‌లో ఉంటున్న కుమారుడు సెనక్కాయల వెంకటరత్నం, అనిత దంపతులు వీటిని సమకూర్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గోపిశెట్టి అచ్చారావు, బిళ్లకుర్తి రామబ్రహ్మ తదితరులు పాల్గొన్నారు. రాపాక పంచాయతీలోని శ్రీరామనగరం షిర్డీసాయిబాబా ఆలయంలో వడ్లమూరి రామరాజు దంపతులు సాయిబాబాకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. చినకొండేపూడి నాలుగు బొమ్మల సెంటర్‌లోని షిర్డీ సాయిబాబా వసతి మందిరంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు, అన్న సమారాధన నిర్వహించారు. వంగలపూడి, సింగవరం, సీతానగరం, రఘుదేవపురం, ముగ్గళ్ల, ఇనుగంటివారిపేట, వెదుళ్లపల్లి, మునికూడలి, కాటవరం, జాలిమూడి, మిర్తిపాడు, బొబ్బిల్లంక, ఉండేశ్వరపురం, ములకల్లంకలలో సాయిబాబా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.


చీపురుపల్లిలో పేదలకు దుప్పట్లు, భోజనం పంపిణీ చేస్తున్న మాజీ సర్పంచ్ చెల్లారాణి


బిక్కవోలులో శాకంబరి అలంకరణలో పార్వతీ దేవి